నిరసనల హోరు..

- నినాదాలతో దద్దరిల్లిన కలెక్టరేట్
- దాడిని ఖండిస్తూ విద్యార్థుల ఆందోళన
- జీతాలు చెల్లించాలంటూ పంచాయతీ, గ్రీన్ అంబాసిడర్ల నిరసన



పని గంటల పెంపును ఉపసంహరించుకోవాలంటూ కలెక్టరేట్ వద్ద సీఐటీయూ ధర్నా



జీతాలు తక్షణమే చెల్లించాలని పంచాయతీ, గ్రీన్ అంబాసిడర్ల నిరసన



సీనియర్ అసిస్టెంట్‌ను అరెస్ట్ చేయాలంటూ విద్యార్థుల ఆందోళన

విజయనగరం గంటస్తంభం: ఆంధ్రప్రదేశ్ శాసన సభ ఇటీవల 8 గంటల పనిదినాన్ని 13 గంటలకు పెంచడంతో పాటు మహిళలను నైట్ షిఫ్టుల్లో పనిచేయించేందుకు అనుమతించేలా చేసిన చట్ట సవరణను వెంటనే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. ఈ డిమాండ్‌తో సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి టీవీ రమణ మాట్లాడుతూ.. బ్రిటీష్‌కాలం నాటి పోరాటాలతో 8 గంటల పని దినం సాధించుకున్నామని.. నేడు ఆ హక్కును ప్రభుత్వమే తొలగిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో కూడా ఇలాంటి చట్ట సవరణలు జరగలేదని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కార్మికులను యజమానులకు తాకట్టు పెడుతున్నారని ఆరోపించారు. కనీస వేతన చట్ట సవరణ 2011 సంవత్సరం నుంచి జరగలేదని.. కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్, డైలీవేజ్ కార్మికులు ఇప్పటికీ చట్ట పరిధిలో లేరని గుర్తుచేశారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కనీస వేతనం రూ.26 వేలు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో సీఐటీయు జిల్లా అధ్యక్షులు కె.సురేష్, కోశాధికారి ఎ.జగన్మోహనరావు, ఉపాధ్యక్షులు పి.శంకరరావు, బి.సుధారాణి, నగర కార్యదర్శి బి.రమణ తదితరులు పాల్గొన్నారు.

జీతాలు చెల్లించాలి..

బకాయి జీతాలు వెంటనే విడుదల చేయడంతో పాటు మున్సిపల్ కార్మికుల మాదిరిగా నెలకు రూ.21వేలు జీతం చెల్లించాలని పంచాయతీ, గ్రీన్ అంబాసిడర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. జిల్లాలో సుమారు 400 మంది పంచాయతీ కార్మికులు, 1000 మంది గ్రీన్ అంబాసిడర్లు దశాబ్దాలుగా గ్రామీణ పరిశుభ్రతకు కృషి చేస్తున్నప్పటికీ.. సక్రమంగా జీతాలు చెల్లించడం లేదన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు.

సీనియర్ అసిస్టెంట్‌ను అరెస్ట్ చేయాలి..

బొండపల్లి మండలం వేంద్రం గ్రామానికి చెందిన సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ ఎంబీఏ విద్యార్థి పిల్లా నానిబాబుపై గంట్యాడ మండల రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ సతీష్ దాడి చేసిన ఘటన కలకలం రేపుతోంది. కడియంతో కంటి కింద గుద్దడంతో తీవ్ర గాయాలపాలైనట్టు బాధితుడు ఆరోపించాడు. ఈ ఘటనపై పోలీసులు నిర్లక్ష్యం వహిస్తున్నారని విద్యార్థులు, గ్రామస్తులు, కుటుంబ సభ్యులు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి, సతీష్‌ను తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

విజయనగరం గంటస్తంభం: ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని పట్టణ పౌర సంక్షేమ సంఘ జిల్లా కార్యదర్శి రెడ్డి శంకరరావు అన్నారు. ఐద్వా, పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అనిల్ నీరుకొండ ఆస్పత్రి సిబ్బంది సహకారంతో ఎల్బీజీనగర్‌లో ఉచిత దంత వైద్యశిబిరం సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా శంకరరావు మాట్లాడుతూ.. సామాన్య ప్రజలకు వైద్యం అందించేందుకు ప్రభుత్వం ముందుకు రావాలన్నారు. వైద్యులు మణికంఠ, జ్యోతి, సృజన, దీపక్ రోగులను పరీక్షించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. అనంతరం ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ మాట్లాడుతూ.. భవిష్యత్‌లో మరిన్ని ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బి.రమణ, శ్రీను, రవికుమార్, సుధీర్, లక్ష్మీకుమారి, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలతో సామరస్య వాతావరణం

- వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీరాములనాయుడు



దుర్గమ్మకు పూజలు నిర్వహిస్తున్న శ్రీరాములునాయుడు, తదితరులు

నెల్లిమర్ల: ఉత్సవాలతో వివిధ వర్గాల ప్రజల మధ్య సామరస్య వాతావరణం ఏర్పడుతుందని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములనాయుడు, ఏడో వార్డు కౌన్సిలర్ మైపాడ ప్రసాద్ అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని కొండపేటలో శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో పాల్గొన్న శ్రీరాములనాయుడు, ప్రసాద్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు మొయిద శ్రీనివాసరావు, పైల భారతి, పెద్దలు జొన్నాడ భాస్కరరావు, సారిపల్లి కృష్ణ, అల్లాడ జనార్ధనరావు, మజ్జి గణేష్, పైల మురళి, తదితరులు పాల్గొన్నారు.

ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న ఎస్సై గణేష్

నెల్లిమర్ల: ఈవ్ టీజింగ్‌కు పాల్పడే విద్యార్థులు, యువకులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై బి. గణేష్ హెచ్చరించారు. పట్టణంలోని మిమ్స్, ప్రభుత్వ జూనియర్ కళాశాలల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను మిమ్స్ ఏఓ గణేష్ తో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. పట్టణంలోని మిమ్స్, సీకేఎం కళాశాలలతో పాటు సతివాడ మోడల్, జేటీఎస్ఎం కళాశాలల వద్ద ఈవ్ టీజింగ్ నివారణ కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

మెప్మా టీఎంసీపై ఫిర్యాదు

నెల్లిమర్ల: నగర పంచాయతీ మెప్మాలో సీఎంఎంగా పనిచేసి విజయనగరంలో టీఎంసీగా తాజాగా బదిలీపై వెళ్లిన దన్నాన గోవిందరావుపై చర్యలు తీసుకోవాలని పట్టణానికి చెందిన బైరెడ్డి గోవిందమ్మ అనే రిసోర్స్‌పర్సన్ సంబంధిత అధికారులకు సోమవారం ఫిర్యాదు చేశారు. తనవద్ద రూ. 3.80 లక్షలు తీసుకుని ఇంతవరకు ఇవ్వలేదని.. పైగా ప్రతిరోజూ ఇంటికి వచ్చి ఇబ్బంది పెడుతున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు.

రిజిస్ట్రేషన్ శాఖలో మార్పులు తీసుకురావాలి

విజయనగరం గంటస్తంభం: స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో మౌలిక మార్పులు తీసుకురావాలని రాష్ట్ర పౌర వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి కోరారు. ఈ మేరకు ఆ శాఖ రాష్ట్ర ఐజీగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను సోమవారం భీశెట్టి కలిసి అభినందించారు.

వినతులు తక్షణమే పరిష్కరించండి



వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ పల్లి నల్లనయ్య

విజయనగరం గంటస్తంభం: విజయనగరం నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మున్సిపల్ కమిషనర్ పల్లి నల్లనయ్య ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, వాటిని తక్షణమే పరిష్కరించాలని సంబంధిత ఇంజినీరింగ్, ప్రణాళిక విభాగం అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. దేవీ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మంటపాలను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దాలని కమిటీ సభ్యులను సూచించినట్లు తెలిపారు. అక్టోబర్ రెండో తేదీ నుంచి నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తుల క్రయ, విక్రయాలు జరగకూడదన్నారు. నగరంలో ఫ్లెక్సీల ఏర్పాటుకు నగరపాలక సంస్థ అధికారుల అనుమతి తప్పనిసరని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు పాల్గొన్నారు.

వేధింపులు ఆపాలి..



సర్వజన ఆస్పత్రి ఎదుట ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డులు

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డులపై వేధింపులు ఆపాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆస్పత్రి వద్ద సోమవారం మధ్యాహ్నం సిబ్బందితో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెక్యూరిటీ గార్డులు, పారిశుధ్య కార్మికులు, పెస్ట్ కంట్రోల్ వర్కర్స్‌కు ప్రభుత్వ జీఓ ప్రకారం వేతనాలు చెల్లించాలన్నారు. కార్మిక చట్టం ప్రకారం రావాల్సిన ఈపీఎఫ్, ఈఎస్ఐ సెలవులు మంజూరు చేయాలని కోరారు. బ్రిటిష్ వారు తీసుకువచ్చిన పది గంటల పని విధానాన్ని నేటికీ అమలు చేయడం సిగ్గుచేటన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సూపరింటిండెంట్ అల్లు పద్మజకు అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మి, మల్లీశ్వరి, అప్పలనాయుడు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి



సమస్య వింటున్న కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి

విజయనగరం అర్బన్: నెల్లిమర్ల పంచాయతీ పరిధిలోని జరజాపుపేట హౌసింగ్ బోర్డు కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా ఫిర్యాదులు విభాగంలో ఫిర్యాదు చేశారు. నగర పంచాయతీ వైస్ చైర్మన్, వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి సముద్రపు రామారావు కౌన్సిల్ సభ్యులతో కలిసి కలెక్టర్ ఎస్. రామసుందర్‌రెడ్డికి అందజేశారు.ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ.. కాలనీలో తాగునీటి కొరత తీవ్రంగా ఉందని, అత్యవసరంగా రెండు బోర్లు మంజూరు చేయాలని కోరారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు హౌసింగ్ పీడీ, పబ్లిక్ హెల్త్ ఈఈలు త్వరలోనే కాలనీలో పర్యటించి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. కలెక్టర్‌ను కలసిన వారిలో నగర పంచాయతీ 17, 18, 19వ వార్డుల కౌన్సిలర్ ప్రతినిధులు మద్దిల వాసు, నల్లి శ్రీను, టి. నారాయణమూర్తి, శివప్రసాద్ ఉన్నారు.

జీఎస్టీ ఉపసంహరణ పెద్ద ఉపశమనం



గేట్ మీటింగ్‌లో పాల్గొన్న ఎల్ఐసీ ఉద్యోగులు

విజయనగరం టౌన్: ఆరోగ్య, జీవిత బీమా ప్రీమియంలపై జీఎస్టీ ఉపసంహరణ ప్రజలకు పెద్ద ఉపశమనమని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ విజయనగరం బ్రాంచ్ యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.తిరుమలరావు, ఆర్. అప్పలనాయుడు అన్నారు. సోమవారం స్థానిక కార్యాలయం ఆవరణలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో వారు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా బీమా ఉద్యోగుల సంఘం చేసిన నిరంతర పోరాటం, ప్రజాభిప్రాయం సమీకరణ ఫలితంగా కేంద్రప్రభుత్వం ఆరోగ్య, జీవిత బీమా ప్రీమియంలపై అమలులో ఉన్న 18 శాతం జీఎస్టీని ఉపసంహరించుకుందన్నారు. ఈ నిర్ణయం ప్రజలకు కొంత ఉపశమనం కలిగించినా.. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం కొనసాగుతూనే ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎల్ఐసి ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా మైఖేల్ ఫారడే జయంతి



ప్రాజెక్ట్ ఎక్స్‌పోలో నమూనా ప్రాజెక్ట్‌ను పరిశీలిస్తున్న ముఖ్య అతిథులు

విజయనగరం అర్బన్: జేఎన్‌టీయూ (జీవీ) కళాశాలలో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో విద్యుత్, విద్యుత్ చుంబకత్వం పితామహుడు మైఖేల్ ఫారడే జయంతి సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏపీఈపీడీసీఎల్ రిటైర్డ్ సూపరింటిండెంట్ ఇంజినీర్ ఎల్ఆర్‌వీ రమణారావు మాట్లాడుతూ.. నూతన ఆవిష్కరణలకు ఫారడే శాస్త్రీయ పరిశోధనలు స్ఫూర్తిగా తీసుకోవచ్చన్నారు. శక్తి సంరక్షణ, పునరుత్పాదక వనరుల వినియోగంపై విద్యార్థులు దృష్టి సారించాలని సూచించారు. ఇందులో భాగంగా విద్యార్థులు నిర్వహించిన వినూత్న నమూనాల ప్రాజెక్ట్ ఎక్స్‌పో ఆకట్టుకుంది. విభాగాధిపతి డాక్టర్ వీఎస్ వకుల పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జీజే నాగరాజు, డాక్టర్ ఎ.పద్మజ, తదితరులు పాల్గొన్నారు.

డీపీటీసీ పరిశీలన



డీపీటీసీని పరిశీలిస్తున్న ఎస్పీ, తదితరులు

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీస్ ట్రైనింగ్ సెంటర్ను ఎస్పీ దామోదర్ సోమవారం ఆకస్మికంగా పరిశీలించారు. త్వరలో ఈ కేంద్రానికి సుమారు 140 మంది కానిస్టేబుళ్లు ట్రైనింగ్‌కు రానున్న నేపథ్యంలో ఏర్పాట్లపై ఆరా తీశారు. శిక్షణార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. తరగతి గదులు, ఆఫీస్, వంట గది, డైనింగ్ హాల్, స్టోర్, వాష్‌రూమ్‌లను పరిశీలించారు. కేంద్రానికి మంచినీటి సరఫరా చేసేలా మున్సిపల్ అధికారులతో మాట్లాడాలని అధికారులను సూచించారు. ఆయన వెంట అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఏఆర్ అదనపు ఎస్పీ జి.నాగేశ్వరరావు, డీపీటీసీ డీఎస్పీ ఎం.వీరకుమార్, ఎస్బీ సీఐ ఏవీ లీలారావు, భోగాపురం సీఐ జి.రామకృష్ణ, డీపీటీసీ సీఐలు బి.లలిత, చంద్రశేఖర్, ఆర్ఎస్సై జి.గోపాలనాయుడు, ఎస్సైలు గణేష్, విక్రమ్, రామగణేష్, దేవి, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రి ఉత్సవాలు

- బాలా త్రిపుర సుందరీదేవి అలంకరణలో దుర్గమ్మ
- మహాలక్ష్మిగా కనక మహాలక్ష్మి

శరన్నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో పట్టణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. వాడవాడలా దుర్గాదేవి మంటపాలు ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. విద్యుత్ ధగధగలతో ఆ ప్రాంతాలన్నీ మెరిసిపోతున్నాయి. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం



విజయనగరం టౌన్ వనంగుడిలో బాలాత్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిస్తున్న దుర్గాదేవి



విజయనగరం టౌన్ పసుపు కొమ్ముల అలంకరణలో అపర్ణాదేవి



గూడ్స్ షెడ్ రోడ్డులో బాలా త్రిపుర సుందరీ దేవిగా విజయసాగర దుర్గామల్లేశ్వరి



విజయనగరం టౌన్: జ్ఞానసరస్వతీ అమ్మవారికి అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు



విజయనగరం టౌన్: మహాలక్ష్మి అలంకరణలో కనకమహాలక్ష్మి



విజయనగరం టౌన్: భజన చేస్తున్న దీక్షాపరులు



రైల్వేస్టేషన్ రోడ్డులో కాళికామాత అవతారంలో అమ్మవారు



కార్పొరేషన్ రోడ్డులో కొలువైన దుర్గాదేవి



నగరపాలక సంస్థ రోడ్డులో విద్యుత్ కాంతులతో దుర్గాదేవి మంటపం



ఆలయంలో భజనలు..



గూడ్స్ షెడ్ రోడ్డులో విద్యుత్ కాంతులు

విజయనగరం టౌన్: శరన్నవరాత్రి మహోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. దుర్గాదేవికి భక్తులు విశేషంగా పూజలు నిర్వహించారు. స్థానిక రైల్వేస్టేషన్ వద్దనున్న పైడితల్లి అమ్మవారి వనంగుడిలో కొలువుదీరిన దుర్గాదేవి.. బాలా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ వేదపండితులు సాయికిరణ్, రాజేష్, దూసి శివప్రసాద్ శాస్త్రోక్తంగా పూజాధికాలు నిర్వహించారు. అమ్మవారికి శ్రీచక్ర కుంకుమార్చనలు చేపట్టారు. అలాగే స్థానిక రింగురోడ్డులో ఉన్న పశుపతి నాథేశ్వరస్వామి ఆలయంలో అపర్ణాదేవి అమ్మవారిని పసుపు కొమ్ములతో అలంకరించారు. సిటిబస్టాండ్ వద్దనున్న కనక మహాలక్ష్మి శ్రీ మహాలక్ష్మి అమ్మవారి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. జ్ఞానసరస్వతీ ఆలయంలో అమ్మవారికి వేదపండితులు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి, తరించారు.

కొత్త అగ్రహారంలో..

కొత్త అగ్రహారం రెండోవీధి శివాలయం వద్ద శరన్నవరాత్రి వేడుకలను భవానీ మాలధారులు ఘనంగా నిర్వహిస్తున్నారు. అర్చకులు సంగీశపు మోహన శర్మ, సాయి కిశోర్‌శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. 29వ తేదీన మూలా నక్షత్రం పురస్కరించుకుని సరస్వతీదేవీ పూజ.. 30న సామూహిక కుంకుమార్చనలు నిర్వహిస్తామని నిర్వహకులు తెలిపారు.

పని గంటల పెంపును వ్యతిరేకించాలి

నెల్లిమర్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న 13 గంటల పని దినాలను వ్యతిరేకించాలని సీఐటీయూ జిల్లా కమిటి సభ్యుడు కిల్లంపల్లి రామారావు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన విద్యుత్ కార్మికులతో మాట్లాడుతూ.. ఎన్నో పోరాటాలు చేసి 8 గంటల పని విధానాన్ని సాధించుకున్నామని, అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరు వల్ల కార్మికులకు తీరని అన్యాయం జరుగుతోందన్నారు. కూటమి ప్రభుత్వం కూడా 13 గంటల పని విధానం అమోదించడం దుర్మార్గమన్నారు. ఇప్పటికే పనిభారంతో కార్మిక వర్గం ఇబ్బందులు పడుతుంటే 13 గంటల పనితో మరింత ఇబ్బంది పడతారని చెప్పారు. పి. లక్ష్మణరావు, ఎల్. గోవిందరావు, పి. రాంబాబు, కె. శ్రీను పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నెల్లిమర్ల: మండలంలోని గుర్ల ఫీడర్ పరిధిలోని పలు గ్రామాలకు మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆ విభాగం విజయనగరం టౌన్ డివిజన్ ఈఈ త్రినాథరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లిమర్ల సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనులు చేపట్టనున్న కారణంగా మొయిద, నారాయణపట్నం, పూతికపేట, కొండగుంపాం, గరికపేట, చింతలపేట, పెదమజ్జిపేట గ్రామాలకు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

జాగ్రత్తలు పాటించాలి

- కొండవెలగాడ సర్పంచ్ గదల బంగారమ్మ



నెల్లిమర్ల: కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న సర్పంచ్ బంగారమ్మ

నెల్లిమర్ల: గర్భిణులు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలని కొండవెలగాడ సర్పంచ్ గదల బంగారమ్మ, స్థానిక వైద్యాధికారులు ధనుంజయ్, శిరీష అన్నారు. సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా వైద్య, ఆరోగ్య శిబిరాలు, పోషణ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అలాగే ప్రధానమంత్రి మాతృవందన యోజన కింద నిర్వహించిన ప్రసూతి ప్రయోజనాలు కార్యక్రమంలో 211 మంది పాల్గొన్నారు. వారిని ఉద్దేశించి సర్పంచ్ మాట్లాడుతూ.. వైద్యాధికారులు, సిబ్బంది ఇచ్చిన సూచనలు పాటించి, పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మిమ్స్ వైద్యులు, ఆస్పత్రి సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



భోగాపురం: ఆరోగ్యశిబిరంలో పాల్గొన్న ఆశ, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు

ఆరోగ్యవంతమైన జీవనశైలి అవసరం

భోగాపురం: పరిశుభ్రత, ఆరోగ్యకరమైన జీవనశైలి అవసరమని సవరవల్లి ప్రెసిడెంట్ ఉప్పాడ విజయ భాస్కరరెడ్డి, పట్నా తాతయ్యలు అన్నారు. స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ పథకంలో భాగంగా సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో వీరు మాట్లాడుతూ.. మహిళలు ఆరోగ్యంగా ఉన్నప్పుడు సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో ఆశ, ఏఎన్ఎంలు, సభ్యులు పాల్గొన్నారు.